APR 2018

## యానాంలో పుదుచ్చేరి చీఫ్ జడ్జి ధనపాల్ పర్యటన

**యానాం, ఏప్రిల్ 6:** నియోజకవర్గంలో పుదుచ్చేరి చీఫ్ జడ్జి ధనపాల్ పర్యటించారు. యానాం వచ్చిన ఆయన సబ్‌కోర్టును సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ముందుగా యానాం ప్రభుత్వ అతిథిగృహం వద్ద యానాం సబ్‌కోర్టు జడ్జ్ హరిహరకుమార్, పలువురు న్యాయవాదులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కోర్టుకు వెళ్ళి రికార్డులను పరిశీలించారు.

## రాజీవ్‌గాంధీ పాఠశాలలో మహిళా సాధికార ఉత్సవాలు

**యానాం, ఏప్రిల్ 6:** రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో మహిళా సాధికార ఉత్సవాలు నిర్వహించారు. రెండో రోజు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు గుత్తుల వెంకట సూర్యనారాయణ, అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, పుదుచ్చేరి మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ డైరెక్టర్ యశ్వంతయ్య, అసిస్టెంట్ డైరెక్టర్‌లు వరలక్ష్మీ, జయప్రియ, విద్యాశాఖాధికారి కాలేసాయినాథ్ హాజరైయ్యారు. కార్యక్రమానుద్దేశించి వక్తలు మాట్లాడారు. విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అతిథులు





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు. పక్క చిత్రంలో ప్రసంగిస్తున్న డైరెక్టర్ యశ్వంతయ్య

## పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు

**యానాం, ఏప్రిల్ 6:** నియోజకవర్గంలో 7, 8, 9 తరగతి విద్యార్థులు పరీక్ష సమయంలో ఎలా చదవాలనే అంశంపై లవ్ యువర్ ఎగ్జామ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిల్డ్రన్స్ ఆడిటోరియంలో యానాం మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ, ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ యన్.ప్రియాంక అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, పుదుచ్చేరి మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ డైరెక్టర్ యశ్వంతయ్య, ఐఆర్ఎస్ అధికారి మల్లిపూడి ఉదయశ్రీరామ్ వినయ్, అసిస్టెంట్ డైరెక్టర్‌లు వరలక్ష్మీ, జయప్రియ, విద్యాశాఖాధికారి కాలే సాయినాథ్, ఎస్వీ రెడ్డి, మన్నా రామకృష్ణారావు తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా డైరెక్టర్ యశ్వంతయ్య, పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, యానాంకు చెందిన ఐఆర్ఎస్ అధికారి శ్రీరామ్ వినయ్ ప్రసంగించారు. ప్రముఖ నిపుణులు డాక్టర్ కృష్ణారావు విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. విద్యార్థులకు బేటీ బచావో- బేటీ పఢావో లోగోతో ముద్రించిన సంచులు, పెన్నులు, పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంచినీటి ట్యాంక్ శుభ్రంపై హర్షం

**యానాం, ఏప్రిల్ 6:** నియోజకవర్గంలోని పాత బస్‌స్టాండ్‌లో గల మంచినీటి ట్యాంక్‌ను మున్సిపాల్ అధికారులు శుభ్రపరిచారు. కొన్ని రోజులుగా మంచినీటి ట్యాంక్ నుంచి మురుగు నీరు వస్తున్నదని దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీట్ ఆఫీసర్ కదలి మధు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మధు మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. సిబ్బందితో ట్యాంక్‌ను శుభ్రపరిచి మంచినీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. వేసవి దృష్టిలో ఉంచుకొని మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.



మంచినీటి ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



## పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**యానాం, ఏప్రిల్ 6:** నియోజకవర్గంలో ఇటీవల జరిగిన జోనల్‌స్థాయి క్రీడా పోటీలలో యానాం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పలువురు వివిధ విభాగాలలో ప్రతిభ సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.బాలాజీ సుధాకర్ తెలిపారు. పాఠశాలకు చెందిన 33 మంది విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించగా మరో ఇద్దరు ద్వితీయ బహుమతులు సాధించారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు టి.శ్రీనివాస్‌ను యానాం పబ్లిక్ స్కూల్ ప్రతినిధులు చింత వెంకట రామయ్య, పొనుగుమట్ల విష్ణుమూర్తి తదితరులు అభినందించారు.

17 APR 2018

# ఆత్మ విశ్వాసంతో సాగాలి

యానాం, న్యూస్‌టుడే: బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయం వరిస్తుందని పుదుచ్చేరి స్త్రీ, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ యశ్వంతయ్య, పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు గుత్తుల వెంకటసూర్యనారాయణ అధ్యక్షతన బాలికా సాధికారత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ విద్యార్థినులు పోషక విలువలు గల ఆహారం తీసుకున్నప్పుడే మంచి ఆరోగ్యం, తద్వారా చక్కని చదువు వస్తాయన్నారు. ఈ సభలో విద్యార్థినులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోషకాహారం గురించి టి.పద్మశ్రీ, మహాలక్ష్మి, ఆత్మరక్షణ మెలకువల గురించి అత్తిలి సత్యనారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారి కాలే సాయినాథ్, వైల్డ్‌లైఫ్ ప్రతినిధి నున్నా రామకృష్ణారావు, నున్నా సురేష్‌కుమార్, ముమ్మిడి వీర నాగప్రసాద్, ఎవిఎస్ మోహన్, జి.మీనాకుమారి, రాజేశ్వరి, శ్రీదేవి, పి.రోజారాణి, నళిని, కల్యాణి, కె.శాంతకుమారి, గంగరాజు, సీహెచ్.మల్లిబాబు, జి.శ్రీకాంత్ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

# నామినేటెడ్ ఎమ్మెల్యేల కేసు వాయిదా

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి తెలియకుండా కేంద్ర హోంశాఖ భాజపాకు చెందిన ముగ్గురిని నామినేటెడ్ ఎమ్మెల్యేలుగా నియమించిన వ్యవహారంపై సుప్రీంకోర్టులో శుక్రవారం కేసు విచారణ మొదలైంది. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్, కాంగ్రెస్ ఎమ్మెల్యే కె.లక్ష్మీనారాయణ తరఫున ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోర్టుకు హాజరయ్యారు. మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు ముగ్గురు నామినేటెడ్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి అనుమతించాలని అటార్నీ జనరల్ కోరగా దీనికి న్యాయమూర్తులు తిరస్కరించారు. ఇరువర్గాలు కేసుకు సంబంధించి తమ వాదనలు వినిపించాలని, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన మద్రాస్ హైకోర్టు తీర్పు, ప్రధాన కేసులను రెండింటినీ రెండు వారాలపాటు వాయిదా వేస్తున్నామని కోర్టు పేర్కొంది. కేసు విచారణ శుక్రవారం జరిగిన నేపథ్యంలో పుదుచ్చేరి స్పీకరు వి.వైద్యలింగం కూడా దిల్లీకి వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్‌వినయ్

# పోటీతత్వం అలవర్చుకోవాలి

యానాం, న్యూస్‌టుడే: మహిళా సాధికారత, వారి అభివృద్ధే దేశప్రగతికి కొలమానమని యానాం నుంచి ఐఆర్ఎస్‌కు ఎంపికైన మల్లిపూడి శ్రీరామ్‌వినయ్ పేర్కొన్నారు. పుదుచ్చేరి స్త్రీ, శిశు సంక్షేమశాఖ సహకారంతో ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ యానాం ప్రాంతానికి చెందిన విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ప్రత్యేక వక్తగా పాల్గొన్నారు. శ్రీరామ్‌వినయ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పోటీతత్వం ఏర్పరుచుకోవాలని, పరీక్షలంటే భయం వీడి ముందుకు సాగాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రగతిలో ఉపాధ్యాయుడిదే కీలక పాత్ర అని, ఒకేషనల్ కోర్సులలో శిక్షణ, ఉద్యోగావకాశాల్లో వారు సరైన మార్గదర్శకత్వం వహించాలన్నారు. ఈ సమావేశంలో ప్రాంతీయ పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, పుదుచ్చేరి స్త్రీశిశు సంక్షేమశాఖ డైరెక్టర్ యశ్వంతయ్య, సహాయ డైరెక్టర్ ఎస్.వరలక్ష్మి, బాలికాభివృద్ధి పథకం అధికారిణి జయప్రియ, విద్యాశాఖాధికారి కాలే సాయినాథ్, యానాం ఇన్‌ఛార్జి చింతా రామజోగి, ఉమా ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ ఎస్‌పీ రెడ్డి, జువైనల్ బోర్డు సభ్యుడు ఎన్.రామకృష్ణారావు, ప్రియాంక ప్రసంగించారు. చక్కని ప్రసంగంతో ఆకట్టుకున్న శ్రీరామ్ వినయ్‌ను నిర్వాహకులు సత్కరించారు.

# అభివృద్ధి పనుల పరిశీలన

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి ఆదిద్రావిడ సంక్షేమశాఖ డైరెక్టర్, కార్పొరేషన్ ఎండీ డి.రఘునాథన్ శుక్రవారం యానాన్ని సందర్శించారు. ఆదిద్రావిడశాఖ మంజూరు చేసిన నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, వసతి గృహాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ అతిథి గృహంలో అధికారులను కలిసిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు పొనుగుమట్ల విష్ణుమూర్తి, జగదం వెంకటేశ్వరరావు, నల్లా సూర్యప్రకాశరావు బృందం వివిధ అంశాలపై తీసుకోవాల్సిన చర్యలు, సూచనలపై వినతిపత్రం అందజేశారు. ఎస్సీ కాంపోనెంట్ నిధుల్ని దుర్వినియోగం చేస్తున్న అధికారులను, వారిపై ఒత్తిడి తెస్తున్న రాజకీయ నాయకులపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్మించిన ఇళ్లన్నీ పాడైపోయినందున పునర్నిర్మాణానికి గృహ రుణాలు మంజూరు చేయాలని, అన్ని ఎస్సీ గ్రామాల్లో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉపకార వేతనాలు సకాలంలో ఇవ్వాలని, 12 ఏళ్లగా మూతపడిన వృత్తిశిక్షణ కేంద్రాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఎస్సీ విద్యార్థులకు విద్యా రుణాలు సకాలంలో ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు యంత్రాల కొనుగోలుకు రుణాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిద్రావిడశాఖ పుదుచ్చేరి అధికారులు కుమారవేలు, డీడీ నాగలింగం, స్థానిక అధికారులు ఎల్.లోవరాజు, కె.రవికుమార్, ప్రముఖులు కోరుకొండ ప్రసాదరావు, మెల్లం శ్రీనివాసరావు, సబ్బతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విజేతలకు అభినందన

యానాం, న్యూస్‌టుడే: యానాం ప్రాంతీయ ఆటల పోటీల్లో 33 ప్రథమ బహుమతులు, రెండు ద్వితీయ బహుమతులు సాధించిన యానాం పబ్లిక్ స్కూల్ విద్యార్థులను విద్యా సంస్థ ఛైర్మన్ చింతా వెంకటరామయ్య, కార్యదర్శి పొనుగుమట్ల విష్ణుమూర్తి శుక్రవారం అభినందించారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు బొజ్జా శ్రీనివాస్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని గుడాల బాలాజీ సుధాకర్ నిర్వహించారు.

# దస్త్రాల తనిఖీ

యానాం, న్యూస్‌టుడే: యానాంలోని సబ్ కోర్టును వార్షిక తనిఖీ చేసేందుకు పుదుచ్చేరి ప్రధాన న్యాయమూర్తి పి.ధనపాల్ శుక్రవారం వచ్చారు. ప్రభుత్వ అతిథి గృహంలో బసచేసిన న్యాయమూర్తి సబ్‌కోర్టును ఉదయం 10 గంటలకు చేరుకుని దస్త్రాలు తనిఖీ చేశారు. యానాం సబ్ జడ్జి ఎ.ఎస్.హరిహరకుమార్ సహకరించారు.

# అద్దె పెంపుపై 9న సమావేశం

యానాం, న్యూస్‌టుడే: యానాం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ గ్రామాలు, పట్టణంలోని 125 దుకాణాల అద్దె పెంపుపై నిర్ణయం తీసుకోవడానికి సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. అంబేడ్కర్‌నగర్ కల్యాణమండపంలో సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గుబ్బా గౌరీసరోజ తెలిపారు.

జనస్పందన
17 APR 2018

# క్రీడలాడితే చదువులోను- ఉద్యోగాల్లోను రాణిస్తారు : మంత్రి మల్లాడి

యానాం, ఏప్రిల్ 5 (జనస్పందన విలేకరి) స్థానిక జీఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహుమతి ప్రధాన కార్యక్రమంలో విచ్చేసిన మల్లాడి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాను చదువుకునే రోజులలో ఆటలాడే సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయని, వాటిని నేను క్షుణ్ణంగా గమనించుకుంటూ నా తోటీ వారికి సహాయ సహకారాలు అందిస్తూ క్రీడల పట్ల ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చేవాడిని. రాజకీయంగా రాణించినప్పటికి పేదరికంతో ఉన్న క్రీడాకారులు ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న క్రీడాకారులను వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని, విద్యార్థులు ముఖ్యంగా గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే క్రీడలలో పట్టుదలతో రాణిస్తే మంచి తత్ఫలితాలు రాణించవచ్చుని, విద్యలోను,ఉద్యోగాలలోను రాణించవచ్చుని మల్లాడి విద్యార్థులకు సూచించారు. క్రీడాకారులకు అన్ని విధాల ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందుతాయని, క్రీడలలో రాణించడం వల్ల ఉద్యోగ అవకాశాలకు మంచి ఫలితాలు లభిస్తాయని, కావున ప్రతి క్రీడల్లోను పట్టుదల, కృషితో ఆడితే మంచి ఫలితాలు లభిస్తాయని ఆయన తెలిపారు.

# క్రీడాకారుని మృతి పట్ల మంత్రి మల్లాడి సంతాపం



యానాం, ఏప్రిల్ 5 (జనస్పందన విలేకరి)స్థానిక పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు యానాంకు విచ్చేసిన సందర్భంగా ఆయన ఇండోర్ స్టేడియంలో ఇటీవల స్థానిక క్రీడాకారుడు ఆదిమూలం కృష్ణ మరణించినందుకు ఆయన క్రీడాకారులతో సమావేశమై 2 నిముషాల పాటు కృష్ణ ఆత్మ శాంతి చేకూరాలని మౌనం వహించి తన సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఒ. దవులూరి సుబ్రహ్మణ్యేశ్వర రావు, శాయ్ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ రాయుడు,వ్యాయామఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సంతాప కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బహుమతులు అందజేసిన మంత్రి మల్లాడి



యానాం, ఏప్రిల్ 5 (జనస్పందన విలేకరి)స్థానిక ఇండోర్ స్టేడియం నందు పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు స్థానికంగా నిర్వహించే క్రీడా పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేసారు. దరియాలతిప్ప, ఫరంపేట, గిరియాంపేట, సావిత్రినగర్, యానాం, కనకాలపేట తదితర ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గతంలో నిర్వహించిన జోనల్ గేమ్స్‌లో విజేతలకు బహుమతి ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వర రావు, డెలిగేట్ టు డిఇ కాలే సాయినాథ్, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ రాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
17 APR 2018

# 21న నవోదయ ప్రవేశపరీక్ష

నవోదయలో ఆరోతరగతిలో ప్రవేశానికి ఈ నెల 21న ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నామని మెట్టకూరులో గల నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ ఎం.అనురాధ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు మున్సిపల్ స్టేషన్ వద్ద గల కెవిబి.కంప్యూటర్ సెంటర్‌లో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు మెట్టకూరు నవోదయలో సంప్రదించాలన్నారు.

# చిల్డ్రన్స్ ఆడిటోరియంలో 'లవ్ యువర్ ఎగ్జామ్'

యానాం మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ ఆడిటోరియంలో 7,8,9 తరగతి విద్యార్థులకు 'లవ్ యువర్ ఎగ్జామ్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలను ఇచ్చారు. చైల్డ్‌లైన్ ద్వారా జరుగుతున్న వివిధ కార్యక్రమాలపై చర్చ జరిగింది. యానాం బాలికల నిష్పత్తి పెంచడానికి నిర్వహిస్తున్న కార్యక్రమా... వివరించారు. ప్రాంతీయ పరిపాలనాధికారి దవు... సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ బాలికల సంరక్షణ ... కార్యక్రమాల ద్వారా సమాజంలో మంచి స్పందన వచ్చింది... చైల్డ్‌లైన్ డైరెక్టర్ ఎస్.పి.రెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్లుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

17 APR 2018

# బాలికల సంరక్షణపై చైతన్యం పెరగాలి

యానాం,ఏప్రిల్6,ప్రభాతవార్త:

బాలికల సంరక్షణ,వారి విద్యకు సంబంధించి ప్రజలలో చైతన్యం తీసుకు రావడానికి పుదుచ్చేరి స్త్రీ,శిశు అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఎన్‌జీఓస్ ద్వారా యానాంలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పుదుచ్చేరి స్త్రీ,శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ యశ్వంతయ్య పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక చిల్డ్రన్ ఆడిటో రియంలో ఆ శాఖ ఆధ్వర్యంలో బేటీబచావో..బేటీపఢావో కార్యక్రమాలలో భాగంగా ఒరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు.యానాం ప్రాంతంలో బాలికల నిష్పత్తిని పెంచడానికి గాను ప్రజలలో అవగాహన కల్పించడానికి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.బాలికల సంరక్షణ, బాలికలవిద్య పట్ల ప్రజలు చైతన్యవంతంగా వ్యవహరించాలని కోరారు.ప్రధానంగా బాలికల నిష్పత్తికి సంబంధించి అందరూ తోడ్పాటును అందించాల్సిన అవసరం ఉందన్నారు.డిడబ్ల్యూసిడి పుదుచ్చేరి సిడిపీవో జె.జయప్రియ మాట్లాడుతూబాలికల సంరక్షణ,వారికి విద్య సమాజానికి చాలా అవసరమని అందరూ గుర్తించాలని కోరారు.బాలికలను కాపాడుకోవడం సమాజంలో అందరి బాధ్యత అన్నారు.దేశంలో 200 జిల్లాలలో బేటీబచావో..బేటీపఢావో కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. బాలికలకు ఎటువంటి ఆపద వచ్చినా వెంటనే1098 నెంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని కోరారు.చైల్డ్‌లైన్ సంస్థ బాలికల సంరక్షణకు పనిచేస్తున్నట్లు తెలిపారు.యానాం పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ యానంలో బాలికల సంరక్షణ కోసం వివిధ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ప్రజలలో మంచి స్పందన కనిపిస్తుందని పేర్కొన్నారు.విద్యార్థులకు పరీక్షలపై .ఉన్న భయాలను అధిగమించి మంచి ఫలితాలు సాధించడంపై ప్రముఖ నిపుణులు డాక్టర్‌కృష్ణారావు ఈ సమావేశంలో అందించే సూచనలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.యానాంకు చెందిన ఐఆర్ఎస్ మల్లిపూడి ఉదయ్ వినయ్ మాట్లాడుతూ సమాజం అభివృద్ధి మహిళలపైనే ఆధారపడి ఉందని, మహిళలను గౌరవించడం మన సంప్రదాయం అన్నారు.బాలికల విద్య సమాజానికి అవసరమన్నారు.ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ డైరెక్టర్ ఎస్.పి.రెడ్డి మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి తమ సంస్థవివిధాంగాలకు సంబంధించి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఎన్నో అవార్డులు అందుకున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో పుదుచ్చేరి డిడబ్ల్యూసిడి అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వీరలక్ష్మి, యానాం ప్రాంతీయ విద్యాశాఖ అధికారి కాలే సాయినాథ్, మోటివేషన్ స్పీకర్ డాక్టర్ సీతారామ కృష్ణారావు, నున్నా రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ ఎస్.శ్రీ యాంక ముందుగా సభకు స్వాగతం పలికారు.ప్రముఖ వ్యక్తిత్వ వికాసనిపుణులు డాక్టర్ కృష్ణారావు విద్యార్థులకు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై వారికి వివరించి అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు,చైల్డ్‌లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్త్రీ,శిశు అభివృద్ధిశాఖ అధికారులు

విజయభాను

17 APR 2018

# బాలికల సంరక్షణకోసం కార్యక్రమాలు

యానాం : బాలికలు సమాజంలో వారి సంరక్షణకోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక చిల్డ్రన్ ఆడిటోరియంలో స్త్రీ మరియు శిశుసంక్షేమశాఖ ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో 7, 8, 9 తరగతులకు చెందిన బాలబాలికలకు పరీక్షల సమయంలో ఏవిధంగా చదివి విజయం సాధించాలో అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిపాలనాధికారి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమాజంలో బాలికల సంరక్షణకోసం పుదుచ్చేరి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి వారి అభ్యున్నతికి కృషిచేస్తుందన్నారు. బాలికలకు ఏ సమస్య వచ్చినా నేరుగా సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ మరియు శిశుసంక్షేమశాఖ అధికారి చింతారామజోగి, డైరెక్టర్ యశ్వంతయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. వరలక్ష్మి, సిడిపిఓ జె జయప్రియ, విద్యాశాఖ అధికారి కాలేసాయినాథ్, డాక్టర్ సీతారామక్రిష్ణారావు, ఎస్‌పి రెడ్డి, నున్నా రామకృష్ణారావు, మల్లిపూడి ఉదయశ్రీ రామవినయ్, తదితరులు ప్రసంగించారు.

17 APR

# 21న నవోదయ ప్రవేశ పరీక్ష

యానాం/ప్రజావ్యూస్: యానాం మెట్టకూరు జవహర్ నవోదయ విశ్వవిద్యాలయం ఆరవ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 21న ప్రవేశ పరీక్షను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ ఎమ్.అనురాధ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారంతా మున్సిపల్ స్టేషన్ దగ్గర కెవిటి కంప్యూటర్ సెంటర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన వారు నేరుగా మెట్టకూరు నవోదయలో సంప్రదించాలని తెలిపారు. ఇతర వివరాలు కోసం నవోదయం కార్యాలయంలో సంప్రదించగలరని తెలిపారు.